ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ఎల్లుండి నుంచి ప్రారంభం కానుంది. బ్రాంచిలు, కాలేజీలపై ఇప్పటికే విద్యార్థులు, తల్లిదండ్రులు అనేక రకాలుగా విచారించి ఉంటారు. మీకు లభించిన సమాచారాన్నంతా క్రోడీకరించి చివరిగా మంచి నిర్ణయం తీసుకోవాలి. విద్యార్థి కెరియర్‌ను మలుపుతిప్పే దశ కాబట్టి అన్ని అంశాలపై స్పష్టతతో కౌన్సెలింగ్‌కు వెళ్లాలి. కౌన్సెలింగ్ ప్రక్రియ గురించి ఆందోళన చెందకుండా ముందుగానే వివరాలు తెలుసుకోవాలి.

# కౌన్సెలింగ్‌కు సిద్ధమేనా?

ఇంజినీరింగ్ విద్యార్థులందరికీ హాట్ ఫేవరేట్ ఈసీఈనే. కొత్త కాలేజీ అయినా ఫర్వాలేదు, ఈసీఈలో సీటొస్తే చాలనుకునే అభ్యర్థుల సంఖ్య పెరుగుతోంది. ఇది రెండు, మూడు దశాబ్దాల నుంచి ఉన్నదే. సాఫ్ట్‌వేర్ రంగంలో ఒడిదుడుకులు తప్పవని చాలామందికి ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. మరోవైపు ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ రంగం భారీగా విస్తరిస్తోంది. టెలివిజన్ల దగ్గర్నుంచి సెల్‌ఫోన్లు, వీడియో గేమ్స్, శాటిలైట్ రేడియో, రోబోటిక్స్ వరకు విజ్ఞానం అంతా ఎలక్ట్రానిక్స్ పరిజ్ఞానంతో ముడిపడిందే. సృజనాత్మకతకు పెద్దపీట వేసే కోర్సు ఈసీఈ. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ పరిశ్రమల అభివృద్ధి ఈసీఈ ఉద్యోగాలకు చాలా కీలకం. మిగతా బ్రాంచిలకు కూడా ఎలక్ట్రానిక్స్ పరిజ్ఞానం అవసరం. ఎలక్ట్రానిక్స్ నేపథ్యం లేకుండా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించడం కష్టం. అందుకే సీఎస్ఈ కంటే ఈసీఈ అగ్రస్థానంలోనే ఉంటుంది.

ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ రంగాల్లో ప్రస్తుతం వీఎల్ఎస్ఐ, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్ స్పెషలైజేషన్లకు బాగా డిమాండ్ ఉంది. పరిశ్రమల అభివృద్ధి, పరిశోధనల్లో పురోగతి ఉంటే భవిష్యత్తు అవకాశాలకు కొరత ఉండదు. వాస్తవానికి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగం స్థిరత్వం దిశగా పయనిస్తోంది. గతంలో మాదిరిగా ప్రోగ్రామింగ్ కోసం వేలసంఖ్యలో నిపుణులను నియమించుకునే పరిస్థితి లేదు. స్వీయ ప్రతిభతోపాటు ప్రమాణాలున్న కాలేజీలో చదివినవారికే సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి అవకాశాలు లభించనున్నాయి.

### భవిష్యత్తును కూడా...

ఇంజినీరింగ్‌లో చేరే విద్యార్థులు తమ బ్రాంచిల భవిష్యత్తు గురించి కూడా తెలుసుకోవాలి. ప్రస్తుతం బీటెక్ తర్వాత ఎంబీఏ చేసేవారి సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి వారికి కంపెనీల్లో మంచి అవకాశాలు లభిస్తున్నాయి. మరికొంతమంది ముందు నుంచే గేట్ పరీక్షను దృష్టిలో ఉంచుకొని బీటెక్‌లో బ్రాంచిని ఎంచుకుంటున్నారు. గేట్‌లో తక్కువ పోటీ ఉండే బ్రాంచిలను ఎంచుకోవడం ద్వారా ఐఐటీలు, ఎన్ఐటీలలో ఎం.టెక్. సీటు సాధించడం తేలికవుతుంది. కొంత సమయం తీసుకున్నప్పటికీ మంచి సంస్థలో ఎం.టెక్. చేయడం ద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలను చేజిక్కించుకోవచ్చు. బ్రాంచి గురించి మరీ ఎక్కువగా ఆలోచించకుండా, ఎం.టెక్. చేయడానికి అవకాశం ఉన్న మంచి కాలేజీలను ఎంచుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది.

ఈఈఈ, మెకానికల్, సివిల్ బ్రాంచిల్లో కూడా మార్పులొస్తున్నాయి. దేశంలో మౌలిక పరిశ్రమలు పెరిగేకొద్దీ ఈ బ్రాంచిలకు మరింత డిమాండ్ ఏర్పడుతుంది. ప్రస్తుతం సగానికిపైనే మెకానికల్ ఇంజినీర్లు సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడుతున్నారు. టీసీఎస్, ఎల్ అండ్ టీ, టీవీఎస్ లాంటి పెద్ద కంపెనీలు మెకానికల్ ఇంజినీర్లను నియమించుకుంటున్నాయి. మెకానికల్ ఇంజినీరింగ్ తర్వాత ఎంబీఏ లేదా ఫైనాన్స్ సంబంధిత కోర్సులు చేస్తే ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందవచ్చు.

### బ్రాంచి ఎంపికలో...

- ఇంజినీరింగ్ టాప్ ర్యాంకర్లలో సాధారణంగా ఎక్కువ మంది తీసుకునేది ఈసీఈ, సీఎస్ఈలే. మిగతా అభ్యర్థులు టాప్ ర్యాంకర్ల మార్గాన్ని అనుసరించడం మంచిదే. అలాగని మీ ఆసక్తి, అభిరుచులకు పూర్తిగా విరుద్ధమైన బ్రాంచిని ఎంచుకోవద్దు.
- బి.టెక్.తో ఆపకుండా ఎం.టెక్./ ఎం.ఎస్. చేస్తే ఉద్యోగ అవకాశాలు తప్పకుండా పెరుగుతాయి. అందువల్ల మీరు ఎంచుకునే బ్రాంచికి పీజీ స్థాయిలో ఎలాంటి విద్య, ఉద్యోగావకాశాలున్నాయో ముందే తెలుసుకుంటే మంచిది.
- బి.టెక్. పూర్తయ్యాక ఉద్యోగం చేయాలనుకుంటే మంచి కాలేజీలో చేరడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పుడు కాలేజీ విషయంలో రాజీపడితే ఎం.టెక్., లేదా ఎం.ఎస్. మంచి సంస్థలో చేయాలి. అప్పుడే మంచి కెరియర్ ఉంటుంది.
- బి.టెక్. నాలుగేళ్ల కోర్సు. అందువల్ల మీరు ఎంచుకునే బ్రాంచికి నాలుగేళ్ల తర్వాత ఉద్యోగావకాశాల పరిస్థితి ఎలా ఉంటుందో అవగాహన ఏర్పరచుకోవాలి.
- అంతగా తెలియని, కొత్తగా ప్రవేశపెట్టే బ్రాంచిల్లో చేరాలనుకుంటే... మనదేశంలో, విదేశాల్లో వాటికున్న విద్య, ఉద్యోగావకాశాలను అంచనా వేయాలి.

### కాలేజీ కీలకం!

- కాలేజీ ఎంపికలో పరిగణనలోకి తీసుకోవాల్సిన ముఖ్యమైన అంశం... అధ్యాపకుల అనుభవం. ఫ్యాకల్టీలో పీహెచ్‌డీలు చేసినవారు ఎంత ఎక్కువమంది ఉంటే అంత మంచిది. పీహెచ్‌డీలు లేకపోతే కనీసం మంచి సంస్థలో ఎం.టెక్. చేసినవారినైనా నియమించుకున్న కాలేజీలను ఎంచుకోవాలి.
- మౌలిక సౌకర్యాలు, ప్రయోగశాలలు రెండో ప్రాధాన్యతాంశాలు. ఇంటికి కాలేజీ దూరమా, దగ్గరా అనేది పెద్ద సమస్య కాదు. మిగతావన్నీ బాగుంటే కాలేజీ దూరమైనా ఫర్వాలేదు. దూరమైతే ఉదయాన్నే లేవడం, ప్రయాణం చేయడం లాంటివి కష్టం కావచ్చు. విద్యార్థుల తల్లిదండ్రులు వీటి గురించి ఆందోళన చెందుతుంటారు. వీటి కంటే విద్యార్థి కెరియర్ ముఖ్యమని భావించాలి. కాబట్టి ఫ్యాకల్టీ, మౌలిక సౌకర్యాలు బాగుంటే కాలేజీ ఇంటికి దూరమైనా చేరొచ్చు.
- చాలా కాలేజీలు గేట్ ఫలితాలను తమ ప్రతిభగా చాటుకుంటుంటాయి. వాస్తవానికి చాలాచోట్ల విద్యార్థులు గేట్ కోసం ప్రత్యేకంగా లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నారు. ఒకవైపు బీటెక్ చదువుతూ సబ్జెక్టు నేర్చుకోవడానికి గేట్ కోచింగ్‌లకు వెళ్లే విద్యార్థులు కూడా ఉంటారు. కాలేజీ ఎంపికలో తప్పు చేసి ఇలాంటి పరిస్థితి తెచ్చుకోవద్దు. సీనియర్ విద్యార్థులను సంప్రదిస్తే ఇలాంటి విషయాలు తెలుస్తాయి.
- ఇంజినీరింగ్‌లో ప్రాక్టికల్స్ చాలా ముఖ్యం. ఏదైనా సూత్రాన్ని చదివినప్పుడు దాన్ని ప్రాక్టికల్ రూపంలో చేసినప్పుడే విద్యార్థికి బాగా అర్థమవుతుంది. సీనియర్ విద్యార్థులను అడిగి ప్రయోగశాలలు, ఫ్యాకల్టీ గురించి తెలుసుకొని కాలేజీలో చేరితే మంచిది.
- ఇంజినీరింగ్ అంటే అప్లయిడ్ మ్యాథమేటికల్ సైన్స్. మ్యాథ్స్ పరిజ్ఞానం బాగా పెంపొందించుకోవాలి. బ్రాంచిని బట్టి కొన్నిటికి ఫిజిక్స్, మరికొన్నిటికి కెమిస్ట్రీ అవసరం. కానీ అన్ని బ్రాంచిలకు మ్యాథ్స్‌పై పట్టు తప్పనిసరి.

### భవితకు ఇవీ!

- విద్యార్థికి సబ్జెక్టు తెలివితేటలున్నా సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ సామర్థ్యాలు చాలా ముఖ్యమని గుర్తించాలి. చేసిన పనిని పేపర్ మీద రాయగలగాలి, మౌఖికంగా వ్యక్తీకరించగలగాలి. ఇతరులను ఒప్పించగలిగే, నమ్రతతో కూడిన భాష అవసరం. టీమ్‌లో పనిచేయగలగడం నేర్చుకోవాలి. ఇవన్నీ ఉంటేనే మంచి ఇంజినీరు కాగలరు.
- గ్రామీణ విద్యార్థులు సబ్జెక్టు ఉన్నా దాన్ని వ్యక్తీకరించడంలో ఇబ్బంది పడుతుంటారు. దీన్ని అధిగమించడానికి కాలేజీల్లో ఇంగ్లిష్ ల్యాబ్స్ ఏర్పాటు చేశారు. వాటిని క్రమం తప్పకుండా ఉపయోగించుకొని సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చు.
- ఇంజినీరింగ్ సబ్జెక్టుల పట్ల ఇంటిగ్రేటెడ్ దృక్పథం అవసరం. భవిష్యత్తులో అన్ని కంపెనీల్లో అందరికీ ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. అందువల్ల బేసిక్ సైన్సెస్‌లో పరిజ్ఞానం పెంపొందించుకోవాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, సైన్సెస్‌లో ప్రాథమిక అవగాహన తప్పనిసరి. తమకు సంబంధించిన స్పెషలైజేషన్‌లో పట్టు అవసరం.

## వెబ్ కౌన్సెలింగ్ ఇలా!

**ఎంసెట్ ఇంజినీరింగ్‌లో ఈ ఏడాది నుంచి వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ప్రవేశపెట్టనున్నారు. ఒకసారి కౌన్సెలింగ్ ద్వారా ఇంజినీరింగ్‌లో చేరిన తర్వాత బ్రాంచిలు, కాలేజీలు మార్చుకోవాలనుకునే వారికి ఇది ప్రయోజనకరం కానుంది. అలాంటి విద్యార్థులు మళ్లీ కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సిన అవసరం లేదు. ఇంటర్నెట్ ఆధారంగా బ్రాంచి, కాలేజీని మార్చుకోవచ్చు. ఈ ప్రక్రియ ఇలా ఉంటుంది...**

- కౌన్సెలింగ్ సమయంలో సీటు కేటాయించిన ప్రతి విద్యార్థికీ ఒక స్క్రాచ్ కార్డు ఇస్తారు. ఇందులో పాస్‌వర్డ్ ఉంటుంది. ఇంటర్నెట్‌లో ఈ పాస్‌వర్డ్ ఆధారంగా విద్యార్థి తన బ్రాంచి, కాలేజీ ప్రాధమ్యాలను మార్చుకోవచ్చు.
- కొత్త కాలేజీలు రావటం ద్వారా అందుబాటులోకి వచ్చే సీట్లు, కేటగిరీలు మార్చుకోవటం, కేటాయింపులను రద్దుచేసుకోవడం, ప్రస్తుతం ఉన్న కాలేజీల్లో సీట్ల సంఖ్య పెరగడం వల్ల ఏర్పడే ఖాళీల్లో చేరడానికి కూడా విద్యార్థి వెబ్ కౌన్సెలింగ్‌ను ఉపయోగించుకోవచ్చు.
- ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవడానికి ఇంటర్నెట్ సదుపాయంతో ప్రత్యేక సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలోగానీ, ఏదైనా ఇంటర్నెట్ కేంద్రం నుంచి గానీ, ఇంట్లో ఇంటర్నెట్ ఉంటే అక్కడి నుంచైనా ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చు.
- వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరవడానికి ముందు విద్యార్థి తప్పనిసరిగా ఒక ఇ-మెయిల్ ఐడీని తయారు చేసుకోవాలి. మార్చుకున్న బ్రాంచి లేదా కాలేజీ నిర్ధారణ అయిన తర్వాత విద్యార్థి ఇ-మెయిల్‌కు సమాచారం పంపిస్తారు. అందువల్ల ఇ-మెయిల్ తప్పనిసరి.

## చదువు

## ఇదీ ప్రక్రియ...

1. కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకోగానే అక్కడ ఉండే కౌంటర్‌లో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రశీదు తీసుకోవాలి. తర్వాత రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఉండే పుస్తకంలో మీ హాల్ టికెట్ నంబరు, ర్యాంకు, పేరు రాసి సంతకం చేయాలి.
2. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తనిఖీ కేంద్రం (వెరిఫికేషన్ కౌంటర్) వద్ద అందజేయాలి. సర్టిఫికెట్ల తనిఖీ పూర్తయ్యాక, ర్యాంకుల క్రమం ప్రకారం మీ కౌన్సెలింగ్ సమయం కోసం హాల్లో వేచి చూడాలి. మీకు ఒక ఆప్షన్ ఫారం ఇస్తారు. దానిలో మీ వివరాలు రాయాలి. ఇప్పుడే బ్రాంచిలు, కాలేజీల ఆప్షన్‌లు రాయకూడదు.
3. కౌన్సెలింగ్ కౌంటర్ వద్ద మీ లోకల్ ఏరియా, కేటగిరీ, తదితర వివరాలు పరిశీలించండి. కౌన్సెలింగ్ మానిటర్‌లో అన్నీ సరిగా నమోదైందీ లేనిదీ చూసుకోవాలి. మీ ప్రాధమ్యాలను ఆప్షన్ పత్రంలో నింపండి. మీరు రాసిన క్రమంలోనే కౌన్సెలింగ్ సిబ్బంది వాటిని నమోదు చేశారో లేదో చూడండి. అవసరమైతే కౌన్సెలింగ్ సిబ్బంది సహాయం తీసుకోవచ్చు.
4. మీ ఆప్షన్‌ల ఆధారంగా సీటును కేటాయించే కీలక దశ ఇది. మీ ఆప్షన్ల ప్రకారం కాలేజీ, బ్రాంచీ అందుబాటులో లేకపోతే... ఆప్షన్లు మార్చుకోవచ్చు. అలాట్‌మెంట్ కౌంటర్ వద్ద మీ సమయం కోసం చూడాలి. మీరు రెండోసారి సూచించిన ఆప్షన్‌ల ప్రకారం సీటు కేటాయిస్తారు. అన్నీ సరి చూసుకొని అలాట్‌మెంట్ ఆర్డర్‌పై సంతకం చేయాలి.
5. సీటు కేటాయించడం పూర్తయ్యాక మీ సర్టిఫికెట్లను బ్యాంకుకు పంపిస్తారు. అక్కడ కూడా మీ పేరు వచ్చేవరకు ఆగాలి. ఫీజును నగదు లేదా డీడీ రూపంలో చెల్లించవచ్చు. తప్పనిసరిగా మొత్తం ఫీజు చెల్లించాల్సిందే.
6. ఫీజు చెల్లించాక అలాట్‌మెంట్ జారీ చేసే కౌంటర్ వద్దకు వెళ్లాలి. మీ సర్టిఫికెట్లు అన్నీ ఇచ్చినట్లు ఒక రశీదు, అలాట్‌మెంట్ ఆర్డర్, ఫీజులు చెల్లించినట్లు మరో రశీదు తీసుకోవాలి. దీంతో కౌన్సెలింగ్ పూర్తయినట్లే!

## ఈ సర్టిఫికెట్లు తప్పనిసరి

- ఎంసెట్ - 2008 ర్యాంకు కార్డు
- ఎంసెట్- 2008 హాల్ టికెట్
- ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, మార్కుల మెమో
- పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం (పదో తరగతి మార్కుల జాబితా)
- 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్లు
- ప్రైవేటు అభ్యర్థులకు.... ఏడేళ్ల నివాస ధృవీకరణ పత్రం
- బీసీ/ ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు... కుల ధృవీకరణ పత్రం
- స్థానికేతర (నాన్ లోకల్) అభ్యర్థులకు... తండ్రి/ తల్లి పేరు మీద ఎం.ఆర్.ఒ. నుంచి పదేళ్ల నివాస ధృవీకరణ పత్రం

## కౌన్సెలింగ్ కేంద్రాలు

- **గుంటూరు:** ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, గుజ్జనగుండ్ల
- **విశాఖపట్నం:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కంచరపాలెం
- **విజయవాడ:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రింగు రోడ్డు, స్టెల్లా కాలేజ్ ఎదురుగా
- **హైదరాబాద్:** సాంకేతిక విద్యా భవన్, మాసాబ్‌ట్యాంక్
- **సికింద్రాబాద్:** గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రింటింగ్ టెక్నాలజీ, ఈస్ట్ మారేడ్‌పల్లి
- **వరంగల్:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎం.జి.ఎం. సర్కిల్
- **తిరుపతి:** ఎస్.వి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కె.టి.రోడ్
- **కడప:** ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, రామాంజనేయపురం



## కాలేజీ చాలా ముఖ్యం!

ఇంజినీరింగ్‌లో చేరేటప్పుడు విద్యార్థులు ప్రధానంగా ఆలోచించాల్సింది... కాలేజీ గురించే! కాలేజీ మంచిదైతే ఏ బ్రాంచిలో చేరినా మంచి శిక్షణ లభిస్తుంది. ప్రస్తుత జాబ్ మార్కెట్‌ను పరిశీలిస్తే బ్రాంచిలకు సంబంధించి అనేక వాస్తవాలు తెలుసుకోవచ్చు. విద్యార్థి ప్రతిభావంతుడైతే అన్ని బ్రాంచిలవారికీ ఐటీ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. అందువల్ల ఏ బ్రాంచి తీసుకున్నా చదువులో అగ్రస్థానంలో ఉండటానికి ప్రయత్నించాలి. ఈసీఈ, సీఎస్ఈలు తీసుకున్నా విద్యార్థిలో ప్రతిభ లేకుంటే ప్రస్తుత పోటీలో మంచి ఉద్యోగం కష్టమేనన్న విషయం మర్చిపోవద్దు!

సమీప భవిష్యత్తులో ఐదు లక్షల మంది ఇంజినీర్లు దేశానికి అవసరం. అన్ని బ్రాంచిల్లోనూ కొన్ని కంప్యూటర్స్ సంబంధిత పేపర్లను బోధిస్తున్నారు. అన్నిటికీ మ్యాథ్స్ లాజిక్ అవసరం. అప్లయిడ్ ఫిజిక్స్, కెమిస్ట్రీ ఉంటుంది. ఐటీ కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చేటప్పుడు ప్రధానంగా పరీక్షించేది వీటినే. ఈ మేరకు ఐటీ కంపెనీల్లో అందరికీ అవకాశాలుంటాయి. విద్యార్థిలో ప్రతిభ ఉంటే ఏ బ్రాంచి చదివినవారినైనా తీసుకోవడానికి కంపెనీలు సుముఖంగా ఉంటున్నాయి. ఈ పరిణామాలను అర్థం చేసుకొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కాలేజీ ఎంపికపై దృష్టిపెట్టాలి.

కాలేజీ ఎంపికలో ఇంకా పరిశీలించాల్సినవి ఏమిటంటే... మొదటి సంవత్సరం ఫలితాలు, చివరి ఏడాది ప్లేస్‌మెంట్లు. ఇంజినీరింగ్ కోర్సులకు దేశవ్యాప్తంగా పేరున్న బిట్స్ (పిలానీ) సంస్థ మంచి కాలేజీకి కొన్ని ప్రమాణాలను తయారుచేసింది. అవి... ఫ్యాకల్టీ, బోధన పద్ధతి, ప్లేస్‌మెంట్లు, మౌలిక సౌకర్యాలు. కాలేజీ ఎంపికలో వీటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి.

**- డా॥ జంధ్యాల విప్లవకుమార్**
డీన్, ఆర్ & డీ; ప్రొఫెసర్, మెటలర్జీ, ఎంజీఐటీ

CA
NA
RS
8 X 10

## నాలుగేళ్ల తర్వాత!

- బ్రాంచిని ఎంచుకునేటప్పుడు అభ్యర్థులు దృష్టిలో ఉంచుకోవాల్సిన ముఖ్యమైన అంశం... ఎంసెట్‌లో మీకు వచ్చిన ర్యాంకు ఆధారంగా ఏదో ఒక బ్రాంచిలో సీటు వస్తుంది, కాబట్టి అందులో చేరదామనుకోవడం మంచిది కాదు. మీ కోర్సు పూర్తయ్యేసరికి నాలుగేళ్లు పడుతుంది. అందువల్ల నాలుగేళ్ల తర్వాత మీరు ఎంచుకునే బ్రాంచికి ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయో ఒక అంచనాకు రావాలి. దాన్ని బట్టి బ్రాంచిని ఎంపిక చేసుకోవాలి.
- ప్రస్తుతం ఉన్న జాబ్ మార్కెట్ ఆధారంగా బ్రాంచిని ఎంచుకుంటే ఒక్కోసారి మీ అంచనా తప్పు కావచ్చు. నాలుగేళ్ల తర్వాత ఏ బ్రాంచికి బాగా డిమాండ్ ఉంటుందనే దాన్ని బట్టే మీ నిర్ణయం సరైందా కాదా అనే విషయం తెలుస్తుంది.

### ఎటునుంచైనా ఐటీకి!

చాలా మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలే అసలైన కెరియర్‌గా భావిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు సీఎస్ఈ, ఐటీ బ్రాంచిలవారికే అనుకుంటే పొరపాటు. ఏ బ్రాంచి తీసుకున్నా, ఐటీలో కొంత శిక్షణ, అనుభవంతో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగం సాధించవచ్చు. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, క్యాడ్/ క్యామ్, ఈఆర్‌పీ, తదితర అంశాల్లో శిక్షణ పొందితే ఐటీ రంగంలో స్థిరపడవచ్చు. కానీ ఐటీ రంగం నుంచి ఇతర బ్రాంచిలకు వెళ్లడం సాధ్యం కాదు.

- వాస్తవానికి ఐటీ రంగం ఇతర రంగాలతో సంబంధం లేకుండా ఎదగలేదు. అన్ని రకాల పరిశ్రమలు వృద్ధి చెందుతున్నప్పుడే ఐటీ రంగంలో కూడా ఉద్యోగావకాశాలు, వేతనాలు బావుంటాయి. సంప్రదాయ పరిశ్రమల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం పెరుగుతున్నప్పుడు ఐటీ ఉద్యోగాల్లో సహజంగానే ఊపు వస్తుంది.
- ప్రస్తుతం ఐటీ రంగంలో స్థిరపడిన ఉన్నత స్థాయి ఉద్యోగులంతా సాఫ్ట్‌వేర్ డిగ్రీల నేపథ్యం నుంచి వచ్చినవారేమీ కాదు. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, మ్యాథ్స్ నేపథ్యంతో కూడా ఐటీ రంగంలో ఉన్నత స్థాయికి చేరవచ్చు.

### ఇదో పెద్ద అపోహ!

అమ్మాయిలకు కొన్ని ఇంజినీరింగ్ బ్రాంచిలు, ముఖ్యంగా సివిల్, మెకానికల్ లాంటివి సరిపడవనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. ఇది అపోహ మాత్రమే. నిర్మాణ రంగంలో మారుతోన్న వ్యాపార స్వభావం, కంపెనీల అవసరాల వల్ల సివిల్ ఇంజినీరింగ్ చేసిన అమ్మాయిలకు ప్రస్తుతం మంచి ఉద్యోగాలు లభిస్తున్నాయి. క్యాడ్, క్యామ్, డిజైనింగ్, ఇంటీరియర్స్ లాంటి విభాగాల్లో అమ్మాయిలకు అవకాశాలు బాగా ఉన్నాయి. కంపెనీల అవసరాలకు అనుగుణంగా ఉద్యోగం చేసే ప్రదేశాలు మారినప్పుడు వివిధ వాతావరణ పరిస్థితులకు అలవాటు పడటం ఎవరికైనా తప్పదు. ఇతర బ్రాంచిల విషయంలోనూ అమ్మాయిలకు సరిపోనివంటూ ఏమీ లేవు. సబ్జెక్టు పట్ల ఆసక్తి ఉంటే ఏ బ్రాంచిలోనైనా నెగ్గుకురావచ్చు.

- ఐఐటీలు, ఎన్ఐటీల్లో ఇంజినీరింగ్ చేయలేకపోతే, దానివల్ల ఒత్తిడికి గురి కావద్దు. బీటెక్ తర్వాత పీజీ చేయడానికి ప్రయత్నించండి. జేఈఈ, ఏఐఈఈఈలతో పోల్చుకుంటే ఐఐటీ, ఎన్ఐటీల పీజీ ఎంట్రన్స్‌లకు పోటీ తక్కువగా ఉంటుంది. బీటెక్ నుంచే శ్రమించి చదివితే పీజీ సీటు సాధించడం ద్వారా ఐఐటీ కలను నెరవేర్చుకోవచ్చు. పీజీ చేయడానికి ముందుగా పనిలో కొంత అనుభవం సాధిస్తే మరీ మంచిది.

**- జి.ఆర్. రెడ్డి,** ఎం.డి., Husys

## 'మౌలిక' అవకాశాలు

ప్రస్తుతం మనదేశంలో మౌలిక సౌకర్యాల రంగం వేగంగా విస్తరిస్తోంది. ఈ రంగంలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు ఉద్యోగ అవకాశాలుంటాయి. మరో ముఖ్యమైన రంగం... ఎనర్జీ. ఇందులో పవర్, ఆయిల్, గ్యాస్ సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజినీరింగ్ స్పెషలైజేషన్లు చేసినవారికి మంచి ఉద్యోగాలుంటాయి. మైటాస్ ఇన్‌ఫ్రా లాంటి కంపెనీలు ఏటా వంద శాతం వృద్ధిని సాధిస్తున్నాయి. ఇదే వృద్ధి కొనసాగితే వచ్చే 4-5 ఏళ్లలో మైటాస్ ఇన్‌ఫ్రాలోనే కనీసం ఇరవై వేల మంది ఇంజినీర్లు అవసరమవుతారు.

### ప్రాథమిక అంశాలపై పట్టు!

సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ లాంటి బ్రాంచిలు ఎంచుకునే అభ్యర్థులు ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. మౌలిక సౌకర్యాల రంగంలో ఉద్యోగాలకు... సబ్జెక్టును అనువర్తిత పద్ధతిలో అర్థం చేసుకోవడం, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, వాల్యూ ఇంజినీరింగ్, తదితర సామర్థ్యాలు అవసరం. ఇంజినీరింగ్ కోర్సుల్లో భాగంగా నేర్చుకునే వాటితోపాటు ఈ అంశాల్లో కూడా ప్రావీణ్యం ఉంటేనే కెరియర్‌లో విజయం సాధించగలరు.

ఇంజినీరింగ్ కెరియర్ ఎంచుకునే అభ్యర్థులకు మరికొన్ని సామర్థ్యాలు అవసరం. భావనలను తయారుచేయడం, విశ్లేషణాత్మక, తార్కిక సామర్థ్యాలు, పీపుల్ మేనేజ్‌మెంట్, టీమ్ మేనేజ్‌మెంట్, ఒకేసమయంలో అనేక పనులు సమర్థంగా చేయగలగడం, మంచి కమ్యూనికేషన్ సామర్థ్యాలు తప్పనిసరి.

**- శ్రీనివాస్ ఉడుముల**
వైస్ ప్రెసిడెంట్, హెచ్.ఆర్., మైటాస్ ఇన్‌ఫ్రా

## తీర్పు మీదే!

విద్య, కెరియర్ విషయాలపై అభిప్రాయం వ్యక్తీకరించాలనే ఆసక్తి మీలో ఉందా? అయితే.. ఓ ఎస్ఎంఎస్ పంపండి చాలు! కింద ఇచ్చిన అంశంపై మీ తీర్పును ఎస్ఎంఎస్ రూపంలో పంపండి.. ఫలితం వచ్చేవారం 'చదువు'లో చూసుకోవచ్చు.

ఈ వారం అంశం: **బి.ఇ./బి.టెక్ తర్వాత పీజీకి కాకుండా ఉద్యోగానికే మీ ప్రాధాన్యమా?**

మీరు చేయాల్సింది ఏమిటంటే... మీ సెల్ ఫోన్‌లో edc అని టైప్ చేసి, స్పేస్ ఇచ్చి y గానీ, n గానీ (మీ అభిప్రాయం ఏదైతే అది) టైప్ చేయాలి.

గత వారం అంశంపై స్పందన ఇదీ!
**ప్రైవేటు ఉద్యోగాల వెల్లువలో గ్రూప్-2 ఉద్యోగాలకు ఆకర్షణ తగ్గిందా?**

| ఔను | లేదు |
|---|---|
| 72% | 28% |

**5600606 నంబరుకు SMS చేయండి!**